క్లుప్తంగా

కనులపండువగా పల్లకిసేవ



పొదలకూరు: పట్టణంలోని శ్రీనివాస లేఅవుట్లో గల లక్ష్మీ, గోదా సమేత వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి, అమ్మవార్లకు పల్లకిసేవను వేడుకగా శనివారం నిర్వహించారు. ఉభయకర్తలుగా వెంకటేశ్వర్లు, లక్ష్మి దంపతులు వ్యవహరించారు. ప్రత్యేకాలంకారంలో దర్శనమిచ్చారు. భక్తులకు ప్రసాదాలను అందజేశారు.

మహాశివుడి విగ్రహావిష్కరణ



మనుబోలు: మనుబోలులోని బొమ్మిరెడ్డి వెంకురెడ్డి స్వర్గధామంలో మహాశివుడి విగ్రహాన్ని శనివారం ఆవిష్కరించారు. ధాతలు బొమ్మిరెడ్డి పార్థేశ్వరరెడ్డి, చైతన్యరెడ్డి రూ.3.5 లక్షలతో విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. నేతలు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, దండు చంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి రామిరెడ్డి, బొమ్మిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, రామసుబ్బారెడ్డి, ముంగర రవీంద్రరెడ్డి, అనమాల ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశువుల తరలింపుపై స్పెషల్ డ్రైవ్

నెల్లూరు(బారకాసు) : ప్రధాన రోడ్లపై వాహనదారులకు అడ్డంకిగా మారిన పశువులను తరలించేందుకు ప్రతిరోజు రాత్రి స్పెషల్ డ్రైవ్‌లను నిర్వహిస్తున్నట్లు వెటర్నరీ వైద్యాధికారి డాక్టర్ మదన్‌మోహన్ తెలిపారు. స్థానిక నెక్లెస్ రోడ్డు, మద్రాసు బస్టాండు, ట్రంకురోడ్డు ప్రాంతాల్లో సంచరిస్తున్న నాలుగు పశువులను శనివారం వేకువజామున పట్టుకుని కల్లూరుపల్లి గోశాలకు తరలించారు. పశువుల యజమానులు బాధ్యతగా వ్యవహరించి, వాటిని చూసుకోవాలని తెలిపారు. లేకుంటే గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

వైభవంగా పడిపూజ

నెల్లూరు(బృందావనం) : వేదాయపాళెంలోని అయ్యప్ప దేవస్థానంలో స్వామివారికి శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు మండల పూజలు, రాత్రి పడిపూజను భక్తిశ్రద్ధలతో, వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయాన్ని పుష్పాలంకరణతో తీర్చిదిద్దారు. భక్తులు విశేషంగా తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు, భిక్ష స్వీకరించారు. ఉభయకర్తలుగా డాక్టర్ బి.నరసింహారెడ్డి- విజయ దంపతులు, రిత్విక్‌రెడ్డి, రఘురామిరెడ్డి వ్యవహరించారు. శ్రీస్వామి అయ్యప్ప సేవా సమాజం అధ్యక్ష, కార్యదర్శులు గూడల శేషగిరిరావు, కత్తుల వెంకటరత్నం, కోశాధికారి గడ్డం రత్నయ్య, కత్తి మోహన్‌రావు, గడ్డం విజయకుమార్, పావళ్ల ప్రసాద్ పర్యవేక్షించారు.

నిబంధనలు పాటించకుంటే ఓసీ నిలుపుదల

నెల్లూరు(బారకాసు) : నగరంలో నిబంధనలకు విరుద్ధంగా చేపట్టిన భవన నిర్మాణాలకు ఆక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసీ) జారీ చేయబోమని కమిషనర్ సూర్యతేజ స్పష్టం చేశారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో భవన నిర్మాణాలకు సంబంధించి అనుమతుల దస్త్రాలను శనివారం తనిఖీ చేశారు. ప్రధానంగా సెట్‌బ్యాక్ పోర్షన్‌లో నిర్మాణాలు చేయకూడదని, జనరేటర్లు పెట్టడానికి వీలు లేదన్నారు. ర్యాంప్‌లు రోడ్డు మీద వరకు రాకూడదని, గ్రీనరీకి కేటాయించిన విధంగా ఉండాలన్నారు. అనంతరం ముత్తుకూరు ఫ్లైఓవర్ సుందరీకరణ పనులను పరిశీలించారు.

అర్జీలు నామమాత్రం

- రెవెన్యూ సదస్సుల్లో ఇదీ తీరు
- దీర్ఘకాలంగా అవే సమస్యలు
- పరిష్కారానికి నోచుకోని వైనం
- భూ వివాదాలు, కోర్టు కేసులు
- గత సదస్సుల్లో పెద్ద ఎత్తున దాఖలు

పొదలకూరు: జిల్లాలోనే పెద్ద మండలంగా పొదలకూరుకు పేరుంది. ఇక్కడ ఉన్నన్ని రెవెన్యూ సమస్యలు మరెక్కడా ఉండవనే నానుడీ ఉంది. ఎన్నిసార్లు రెవెన్యూ సదస్సులను నిర్వహించి.. ప్రజావిజ్ఞప్తులను స్వీకరించినా సమస్యలు పుట్టుకొస్తూనే ఉంటాయి. ప్రధానంగా భూ వివాదాలు, పట్టా భూములు అనాధీనంగా మారడం, నోషనల్ ఖాతా నంబర్లు, దారి తకరాదులు, అదనంగా భూమి చూపడం, చుక్కల భూములు తదితర సమస్యలున్నాయి. అయితే గతంలో ఇలాంటి సమస్యలకు సంబంధించి అప్పటి మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నేరుగా రెవెన్యూ కార్యాలయానికి విచ్చేసి తహసీల్దార్ సమక్షంలో రైతుల నుంచి వినతులను స్వీకరించి చాలా సమస్యలకు పరిష్కారం చూపారు. అయినా రెవెన్యూ శాఖలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తహసీల్దార్‌గా బాధ్యతలు నిర్వర్తించే వారు నెల్లో సగం రోజులు కోర్టులకు హాజరుకావడంతోనే సరిపోతున్నట్లు తెలుస్తోంది.

స్పందనేదీ..?

రీ సర్వే నిర్వహించిన గ్రామాల్లో రెవెన్యూ సదస్సులను అక్టోబర్‌లో నిర్వహించి వినతిపత్రాలను స్వీకరించారు. 23 గ్రామాల్లో రీ సర్వేను నిర్వహించి, కొన్ని గ్రామాల రైతులకు గత ప్రభుత్వంలో పాస్‌పుస్తకాలను అందజేశారు. అయితే కొన్ని గ్రామాల్లో సమస్యలు ఉండటంతో సదస్సుల్లో సుమారు 500 అర్జీలను అందజేశారు. వీటిని పూర్తిస్థాయిలో పరిష్కరించకుండానే ఈ నెల్లో రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేయడంతో రైతుల నుంచి స్పందన కనిపించడం లేదు. ఒక్కో సదస్సులో రెండు నుంచి ఐదు వరకే వినతిపత్రాలు అందుతున్నాయి.



రెవెన్యూ సదస్సుకు హాజరైన అధికారులు

36 రెవెన్యూ గ్రామాలు

మండలంలో 36 రెవెన్యూ గ్రామాలున్నాయి. రెవెన్యూ సదస్సులను జనవరి ఎనిమిది వరకు అధికారులు నిర్వహించనున్నారు. మండలంలో వేల ఎకరాల ప్రభుత్వ భూములతో పాటు, కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, సహజ సిద్ధమైన ప్రకృతి సంపద ఉంది. ఆయా ప్రాంతాల్లో వీటిని కొందరు ఆక్రమించడంతో సమస్యలు అధికంగా ఉన్నాయి. అనాధీనం అని చూపే భూముల సర్వే నంబర్లు మ్యుటేషన్ల కోసం వెబ్‌ల్యాండ్‌లో కనిపించడంలేదని రైతులు వాపోతున్నారు. అసైన్డ్ భూముల వారసత్వంపై పేర్ల మార్పులు, చేర్పులపై చాలా మంది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. చుక్కల భూముల సమస్యలు చాలా వరకు పరిష్కారమైనా, కొన్ని గ్రామాల్లో 22ఏ తొలగింపుపై వినతిపత్రాలు అందుతూనే ఉన్నాయి. భూముల వ్యవహారాల్లో న్యాయస్థానాలను ఆశ్రయిస్తున్న తరుణంలో రైతులకు సంబంధించిన భూ హద్దులు, దారి గొడవలు ప్రధాన సమస్యలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో రీ సర్వేలో అక్షాంశ, రేఖాంశ ఆధారంగా ఆధునాతన టెక్నాలజీ ద్వారా మార్కింగ్ ఇచ్చి ప్రతి కమతానికి గుర్తింపు నంబర్ ఇచ్చారు. ఆయా గ్రామాల్లో సర్వే నంబర్ ఒకటి నుంచి కొత్తగా నంబర్లను ఇస్తూ సర్వే పూర్తయిన తర్వాత గ్రామసభ నిర్వహించి పాస్‌పుస్తకాలను అందజేశారు. అయితే తొలి విడతలో తొలిసారిగా సర్వే చేసిన మొగళ్లూరులో సమస్యలు నెలకొన్నాయి. గ్రామాల్లో ప్రభుత్వ, ప్రైవేట్ భూములతో పాటు, గ్రామకంఠం భూములనూ సర్వే చేయించారు.

సమస్యలు పరిష్కారం కావడంలేదు



భూములకు సంబంధించిన సమస్యలు త్వరితగతిన పరిష్కారం కావడం లేదు. కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా నెలల సమయం పడుతోంది. సర్వే నంబర్లు మారి, ఇతరుల పేర్లు వెబ్‌ల్యాండ్‌లో పడినా పరిష్కరించుకునే అంశంలో ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

– రామయ్య, రైతు, చెర్లోపల్లి

వినతులు తక్కువే



గతంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సుల్లో అర్జీలు పెద్ద సంఖ్యలో అందాయి. దీంతో ప్రస్తుతం నిర్వహించే సదస్సుల్లో స్వల్పంగా అందుతున్నాయి. చిన్నపాటి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నాం. వెబ్‌ల్యాండ్‌లో పేర్ల తప్పొప్పులుంటే వెంటనే సదస్సులో పరిష్కరించగలుగుతున్నాం. మా స్థాయిలో లేని వాటిని పరిశీలనకు పంపుతున్నాం.

– శివకృష్ణ, తహసీల్దార్, పొదలకూరు

వేడుకగా దత్తాత్రేయ జయంతి



పొదలకూరు: పట్టణంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో దత్తాత్రేయ జయంతిని శనివారం నిర్వహించారు. బాబాకు కాకడ హారతి, దత్తాత్రేయస్వామికి అభిషేకాలు, గురుచరిత్ర పారాయణం తదితరాలను జరిపారు. మందిర సేవా సమితి అధ్యక్ష, కార్యదర్శులు చీమకుర్తి రాజగోపాల్, దామోదర్‌రావు, సభ్యుడు లక్కాకుల ఆనందరావు, అర్చకుడు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొట్టి శ్రీరాములుకు కళాత్మక నివాళి





ముత్తుకూరు: ఎండిన బాదం ఆకుపై పొట్టి శ్రీరాములు చిత్రాన్ని మండలంలోని నారికేళపల్లి పంచాయతీ సుబ్బారెడ్డిపాళెం యూపీ స్కూల్ తెలుగు పండిట్ సోమా పద్మారత్నం శనివారం తీర్చిదిద్దారు. అమరజీవి వర్ధంతిని పురస్కరించుకొని కళాత్మకంగా నివాళులర్పించారు.

పొదలకూరు: మండలంలోని మహ్మదాపురానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు పచ్చా పెంచలయ్య రావి ఆకుపై పొట్టి శ్రీరాములు రూపాన్ని తీర్చిదిద్దారు. ఈ సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

ఓటర్లు ఓడించినా అధికారులు గెలిపించారు

- చర్చనీయాంశంగా కుడితిపాళెం టీసీ–12 ఎన్నికల తీరు
- నాయకులు చెబితే ఫలితాలు మారుస్తారా.. అంటూ స్థానికుల ఆగ్రహం

కోవూరు : సాగునీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి ఓటర్లు ఓడించిన వ్యక్తిని నాయకులు, అధికారులు కలిసి గెలిచినట్లు ప్రకటించారు. ఈ ఘటన ఇందుకూరుపేట మండలంలో జరిగింది. ఇందుకూరుపేట మండలంలోని ఏడు నీటి సంఘాల్లో అన్నీ ఏకగ్రీవమవగా, కుడితిపాళెంలోని టీసీ–12కు సంబంధించి ముదివర్తిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఎన్నిక జరిగింది. మెట్టా శ్రీనివాసులురెడ్డి, మాజీ సర్పంచ్ ఆమారి సుధాకర్ భార్య ఆమారి పాపమ్మ పోటీ పడ్డారు. శ్రీనివాసులురెడ్డికి 36 ఓట్లు రాగా పాపమ్మకు 39 ఓట్లు లభించాయి. దీంతో దళిత మహిళ పాపమ్మ మూడు ఓట్లతో గెలుపొందినట్లు అధికారులు ప్రకటించారు. విషయం తెలుసుకున్న టీడీపీ నేత కోడూరు కమలాకర్‌రెడ్డి రంగ ప్రవేశం చేసి అధికారులకు దిశా నిర్దేశం చేశారు.



కమలాకర్‌రెడ్డిని ప్రశ్నిస్తున్న నాయకులు

దీంతో గెలుపొందిన పాపమ్మను ఓడినట్లు, శ్రీనివాసులురెడ్డి విజయం సాధించినట్లు ప్రకటించారు. కొద్దిసేపు ఇరువర్గాల మధ్య రసాభాసా సాగింది. అభ్యర్థి పాపమ్మతో పాటు ఆమె భర్త సుధాకర్‌కు నాయకులు హుకూం జారీ చేయడంతో ఇష్టం లేకున్నా చేసేదేమీ లేక ఇరువురు మిన్నకుండిపోయారు. కాగా అధికారు తీరుపై ఆ ప్రాంత వాసులు మండిపడుతున్నారు. ప్రధానంగా ఇరిగేషన్ ఏఈ అలీ వ్యవహార శైలి చర్చనీయాంశంగా మారింది. కాగా దీనిపై సాక్షి ఆయన్ను వివరణ కోరగా స్పందించలేదు.

సాగుకు అన్నదాత సన్నద్ధం

- చెరువులు, వాగుల్లో పుష్కలంగా నీరు
- వేధిస్తున్న ఎరువుల కొరత

మనుబోలు: ఆశ.. నిరాశల మధ్య మండల రైతులు సాగుకు సన్నద్ధమవుతున్నారు. ఇప్పటికే దుక్కిదున్ని పొలాన్ని సిద్ధం చేసిన అన్నదాతలు ప్రస్తుతం ముమ్మరంగా నాట్లు వేస్తున్నారు. 60 శాతం మంది ఇప్పటికే నాట్లు వేయగా, మిగిలిన వారు వేస్తున్నారు. మండలంలో రైతులు ఏటా 25 వేల ఎకరాలకు పైగా వరిసాగు చేస్తారు. ఇందులో 15 వేల ఎకరాలు కండలేరు ఆయకట్టు కాగా, మరో 10 వేల ఎకరాలకుపైగా కనుపూరు కాలువకు అనుబంధంగా ఉన్న బండేపల్లి బ్రాంచ్, పొట్టేళ్ల కాలువల పరిధిలో సాగు చేస్తారు. ఈ ఏడాదిలో ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులు, వాగుల్లో సాగుకు సరిపడా నీరు ఉండటంతో వ్యవసాయ పనులను ప్రారంభించారు. బండేపల్లి బ్రాంచ్, పొట్టేళ్ల కాలువలపై ఆధారపడి వడ్లపూడి, రాజోలుపాడు, వీరంపల్లి, గొట్లపాళెం, లింగారెడ్డిపల్లి, నాయుడుపల్లి, అక్కంపేట, మడమనూరు, బండేపల్లి, జట్లకొండూరు, కొమ్మలపూడి తదితర గ్రామాల్లో వరి సాగు చేస్తారు. మనుబోలు, చెర్లోపల్లితో పాటు హైవేకు తూర్పు వైపున ఉన్న గ్రామాల చెరువులకు కండలేరు ద్వారా సాగునీరు చేరుతుంది.

ఎరువుల కొరతతో ఆందోళన

ప్రస్తుతానికి సాగునీటికి లోటు లేకపోవడంతో నాట్లు వేస్తున్నా.. డీఏపీ, యూరియా కొరతతో రైతులు ఆందోళన చెందుతున్నారు. డీఏపీ ఎక్కడా అందుబాటులో లేని పరిస్థితి. యూరియా కష్టంగా దొరుకుతున్నా, దాని కోసం అవసరం లేని ఏదో ఒక దాన్ని కొనుగోలు చేయాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు. సీజన్ ప్రారంభంలోనే ఇలా ఉంటే తర్వాత పరిస్థితి ఎలా ఉంటుందోనని వారు మదనపడుతున్నారు. రైతులకు ఎరువులను సకాలంలో సరఫరా చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది.



మనుబోలు పెద్ద చెరువులో సమృద్ధిగా సాగునీరు

ఎరువుల కొరతను తీర్చాలి



నాట్లు వేయడమే ఇంకా పూర్తి కాలేదు, అప్పుడే మార్కెట్లో యూరియా కొరత నెలకొంది. సన్న యూరియా దొరకడం కష్టంగా ఉంది. డీఏపీ అందుబాటులోనే లేదు. షాపుల్లో యూరియా కావాలంటే నానో యూరియా, మరొకటో కొనుగోలు చేయాలనే నిబంధన పెడుతున్నారు. ఆర్బీకేలున్నా, వాటిలో దొరికే పరిస్థితి లేదు.

– మన్నెమాల శ్రీహరిరెడ్డి, రైతు, గురివిందపూడి

ఎరువుల కొరత రానివ్వం



ప్రస్తుతం డీఏపీకి కొరత ఉన్నా, దాన్ని అధిగమిస్తాం. యూరియా కావాలనుకునే రైతులు ఆర్బీకేల్లో ముందుగా నగదు చెల్లిస్తే రెండు రోజుల్లో సరఫరా చేస్తాం. బయట దుకాణాల్లో ఎక్కడా అధిక ధరలకు విక్రయించకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పుడిప్పుడే నాట్లు వేస్తున్న తరుణంలో రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. త్వరలోనే ఎరువులు సమృద్ధిగా అందుబాటులోకి వస్తాయి.

– జహీర్, ఏఓ



పొలం



నారు పెరుకుతున్న కూలీలు

టీబీ, లెప్రసీలను అరికడదాం

నెల్లూరు(అర్బన్) : జిల్లాలో చాపకింద నీరులా వ్యాపిస్తున్న టీబీ, అలాగే ఇంకా అక్కడక్కడ కనిపిస్తున్న లెప్రసీ జబ్బులను పూర్తిస్థాయిలో అరికట్టడమే లక్ష్యంతో వైద్యసిబ్బంది కృషి చేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ, జిల్లా టీబీ, లెప్రసీ నివారణాధికారి డాక్టర్ ఖాదర్‌వలీ అన్నారు. నగరంలోని రాజాగారి వీధిలో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్, చాకలివీధిలో ఉన్న అర్బన్ కేంద్రం, జిల్లా క్షయ నివారణ కేంద్రంలో ఉన్న ల్యాబ్, ఐసీటీసీ కేంద్రం, బీవీనగర్‌లో ఉన్న డామియన్ ఫౌండేషన్ ఇండియా ట్రస్ట్ కేంద్రాలను ఆయన శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడి రికార్డులను పరిశీలించారు. ప్రజలు అవగాహన లేక, తగిన జాగ్రత్తలు పాటించకపోవడం వల్లనే ఈ జబ్బులు వస్తున్నాయన్నారు. మొదట్లోనే ఈ జబ్బులు గుర్తిస్తే తగిన వైద్యం ద్వారా నయం చేయవచ్చన్నారు. ప్రజలను టీబీ, లెప్రసీపై అప్రమత్తం చేయాలన్నారు.

సాగునీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం

కొడవలూరు : మండలంలోని తొమ్మిది నీటి సంఘాలకు శనివారం నిర్వహించిన ఎన్నికల్లో అన్ని పాలకవర్గాలు ఏకగ్రీవమయ్యాయి. అన్ని సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులతో పాటు సభ్యులకు ఒక్కో నామినేషన్ మాత్రమే దాఖలు కావడంతో ఎన్నికల అధికారులు ఏకగ్రీవమైనట్లు ప్రకటించారు. కాగా ఆయా నీటి సంఘాల పాలకవర్గాలకు అధికారులు శనివారమే ధ్రువీకరణ పత్రాలు అందజేశారు.

సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి

కొత్త నీటి సంఘాల పాలకవర్గాలు రైతుల సాగునీటి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని పౌరసరఫరాల శాఖ రాష్ట్ర డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి సూచించారు. గండవరం బిట్–2 నీటి సంఘానికి ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు కోడూరు సుధాకర్‌రెడ్డి, చుండి శశిధర్‌రెడ్డి, బిట్–3కి ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులు కంచి ఈశ్వర్‌రెడ్డి, కిశోర్ నాయుడులను స్థానిక హైస్కూల్‌లో శనివారం సన్మానించారు. స్థానిక నాయకులు ఆలం మాలకొండయ్య, నాపా వెంకటేశ్వర్లు నాయుడు, మాగుంట సతీష్‌రెడ్డి, కోడూరు బుజ్జిరెడ్డి పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

కొడవలూరు బిట్–1 నీటి సంఘానికి సంబంధించి స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని తహసీల్దార్ కె.స్ఫూర్తి శనివారం పరిశీలించారు. 12 మంది సభ్యులకు ఒక్కో నామినేషన్ వంతున దాఖలై ఉండడంతో అన్నీ ఉన్నాయా లేవా పరిశీలించారు. తదుపరి ఎన్నిక నిర్వహణపై పోలింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఆమె వెంట ఈఓపీఆర్డీ సాయిప్రసాద్, హౌసింగ్ ఏఈ ముక్తార్‌బాషాలు ఉన్నారు.



కొడవలూరు : నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులకు సన్మానం

➡ విడవలూరు : మండలంలో మొత్తం ఎనిమిది నీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహించగా మొత్తం ఏకగ్రీవమయ్యాయి.

➡ బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని ఐదు నీటి సంఘాల ఎన్నికలు ఏకపక్షంగా చిత్రవిచిత్రాల నడుమ పూర్తయ్యాయి. రేబాల నీటి సంఘంలోని మూడో ప్రాదేశికంలో బెజవాడ కృష్ణమోహన్‌రెడ్డి అనే ఒక్క ఓటరు పేరు మాత్రమే నమోదైంది. అతను కూడా పోలింగ్‌కు హాజరు కాలేదు. దీంతో ఆ సెగ్మెంట్ ఎన్నికను నిలుపుదల చేశారు. ఇదేలా మండలంలోని మరో రెండు నీటి సంఘాల్లో కూడా విచిత్రాలు జరిగినట్లు తెలుస్తోంది. అయితే ఎన్నికల ప్రక్రియ మాత్రం ఏకపక్షంగా సాగిందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కూటమిలో సీపీఎం కూడా కలవడం ఎన్నికల ప్రత్యేకతగా చర్చ సాగుతోంది.

➡ కోవూరు : మండలంలోని పాటూరు, కోవూరు, ఇనమడుగు ప్రాంతాల్లో సాగునీటి సంఘాల ఎన్నికలు జరిగాయి. అన్నీ ఏకగ్రీవమయ్యాయి.

ఇష్టారాజ్యంగా ఏకగ్రీవాలు

మనుబోలు: మండలంలో శనివారం నిర్వహించిన సాగునీటి సంఘాల ఎన్నికలపై రైతులు ఆసక్తి చూపకపోవడంతో అధికార పార్టీకి చెందిన వారే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అయితే ఒకట్రెండు చోట్ల పోటీలో నిలిచేందుకు కొందరు ఔత్సాహిక రైతులొచ్చినా, వారి నామినేషన్లను స్వీకరించలేదని పలువురు ఆరోపించారు. జట్లకొండూరులో నిర్వహించిన సాగునీటి సంఘ ఎన్నికల్లో టీసీ – 9, 10, 11, 12కు సంబంధించి నామినేషన్ వేసేందుకు 10.15కు పోలింగ్‌స్టేషన్‌కు చేరుకోగా, అప్పటికే సమయం మించి పోయిందంటూ తమను అడ్డుకున్నారని ఉప సర్పంచ్ ఆవుల తులసీరామ్ ఆరోపించారు. అధికారుల తీరుపై నిరసన తెలిపారు.

➡ గురివిందపూడిలో అధికార పార్టీ వారే రెండు వర్గాలుగా విడిపోయి ఘర్షణకు దిగడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. దీంతో ఎన్నికను అధికారులు వాయిదా వేశారు. ఎన్నికైన వారికి ధ్రువీకరణ పత్రాలను అధికారులు అందజేశారు. ప్రక్రియను తహసీల్దార్ సుబ్బయ్య, ఎంపీడీఓ జలజాక్షి పర్యవేక్షించారు. సీఐ శివరామకృష్ణ, ఎస్సై శివరాకేష్ బందోబస్తు ఏర్పాట్లు చేశారు.



మాట్లాడుతున్న తులసీరామ్

➡ వెంకటాచలం మండలంలోని కసుమూరు, కందలపాడులో తమను నామినేషన్ వేయనీయకుండా పోలీసులు అడ్డుకున్నారని పలువురు ఆరోపించారు. కసుమూరులో రైతులకు నో డ్యూస్ సర్టిఫికెట్ ఇవ్వకుండా అడ్డుకున్న అధికారులను ప్రశ్నించినందుకు గానూ తనను పోలీస్‌స్టేషన్‌కు తరలించి ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యాక వదిలిపెట్టారని మస్తానయ్య వాపోయారు. కందలపాడులో ఉదయం పది గంటలకే పోలింగ్ కేంద్రానికి వెళ్లిన పది మంది నామినేషన్లను స్వీకరించలేదు. 12 గంటల తర్వాత అక్కడి నుంచి వారిని పోలీసులు పంపి ప్రక్రియను పూర్తి చేశారు.

పొదలకూరు: మండలంలో సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయని ఇరిగేషన్ ఏఈ రవి కుమార్‌రెడ్డి తెలిపారు. 29 సంఘాలకు గానూ అన్నింటికీ ఎన్నికలను నిర్వహించారు. ఎక్కడా ఎలాంటి ఘర్షణలు చోటుచేసుకోకుండా ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి.

ముత్తుకూరు: మండలంలోని ఆరు సాగునీటి సంఘాలకు సంబంధించిన ఎన్నికలు ఏకగ్రీవమయ్యాయి. టీడీపీ, బీజేపీ కూటమి నేతలు ఈ సంఘాలను వశం చేసుకున్నారు.

వెంకటాచలం: మండలంలో నిర్వహించిన సాగునీటి సంఘ ఎన్నికల్లో 12 స్థానాల్లో కూటమి పార్టీల వారే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నోడల్ అధికారి పెంచలరావు పర్యవేక్షించారు.

తోటపల్లిగూడూరు: మండలంలోని ఐదు సాగునీటి సంఘాల పాలకపక్షాలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. పొత్తు ధర్మాన్ని ఏ మాత్రం పాటించకుండా ఐదు చోట్ల టీడీపీ అభ్యర్థులను అధ్యక్షులుగా పట్టం కట్టడంపై కూటమిలోని బీజేపీ, జనసేన అభిమానులు షాక్‌కు గురయ్యారు.